క్లుప్తంగా

నందికోలలు విరాళం



నందికోల సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: ఉప్పలదడియ గ్రామంలో వెలసిన వీరభద్రస్వామికి శుక్రవారం గడివేముల మండలం గని గ్రామానికి చెందిన మలిగే అడివప్ప రూ. 80 వేలు విలువ చేసే నందికోలలను విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన పురోహితులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో స్వామివార్లకు కుంకుమార్చన, పుష్పార్చన, అభిషేకం తదితర విశేషపూజలు చేశారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో నందికోల సేవా నిర్వహించారు. కమతం బ్రదర్స్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

జొన్నలు కొనుగోలు చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ బి.ఆంజనేయ

కొత్తపల్లి: మండలంలో సాగు చేసిన మహేంద్ర జొన్నలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు ఆత్మకూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బి.అంజేయ అన్నారు. శుక్రవారం మండలంలోని దుద్యాల గ్రామంలో రైతుభరోసా కేంద్రంలో ఏఓ కె.మహేష్ ఆధ్వర్యంలో జొన్న రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరైనా మహేంద్ర జొన్నరకం పంటను సాగుచేసి ఉంటే ఆ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వ జొన్నలకు మద్దతు ధర రూ. 2,970గా నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ వెంకటసుబ్బయ్య, ఏఈఓ వెంకటనారాయణ, డీసీఎంఎస్ మేనేజర్ నవీన్, రైతులు పాల్గొన్నారు.

ఊరూరా ఆధార్ క్యాంపులు

కొత్తపల్లి: ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ఊరూరా ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తోందని ఎంపీడీఓ మేరి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ క్యాంపుల నిర్వహించే తేదీని పంచాయతీ కార్యదర్శులు ఒక రోజు ముందుగానే గ్రామాల్లో దండోరా వేయించి తెలియజేస్తారన్నారు. ఈనెల 20 వ తేదీన కొక్కెరంచ, ఎర్రమఠం, 21 న ఎదురుపాడు, ముసలిమడుగు, 27 దుద్యాల, నందికుంట, గుమ్మడాపురం, 28 గువ్వలకుంట్ల, శివపురం, 29 కొత్తపల్లి, గోకవరం గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాదయాత్రికులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

పాములపాడు: ఉగాది బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాలినడకన శ్రీశైలానికి వెళ్తున్న భక్తులకు అఖిల భారత పూసల, కృష్ణబలిజ, శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం కార్యక్ర మం ఏర్పాటు చేశారు. మండలంలోని యర్రగూడూరు గ్రామ సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామస్వామి మాట్లాడుతూ పాదయాత్రీకులకు ఆకలి తీర్చడం ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజశేఖర్, కుళాయప్ప, మధుసూదన్‌రావు, రాంపతి, వెంకటేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

మిడుతూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగలూటి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలని సూచించారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చైతన్యం తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేలకొరిగిన ఆశలు

- పలు మండలాల్లో అకాల వర్షం
- దెబ్బతిన్న మిరప, మొక్కజొన్న, ఉద్యాన పంటలు
- ఆందోళనలో రైతులు
- పంటనష్టం అంచనా వేస్తున్న అధికారులు



మిడుతూరు.. తలముడిపిలో దెబ్బతిన్న బొప్పాయి తోట



బండిఆత్మకూరులో వాలిపోయిన మొక్కజొన్న పైరును చూపుతున్న రైతు శంకర్‌రెడ్డి

మిడుతూరు/బండిఆత్మకూరు: అకాల వర్షం అన్నదాతకు అపార నష్టం కలిగించింది. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీంతో బోరు, బావులు, సాగునీటి కాలువల కింద సాగు చేసిన మిరప, మొక్కజొన్న, కొర్ర, వరి పంటలు నేలకొరిగాయి. పలు చోట్ల బొప్పాయి, అరటి తదితర పండ్లతోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మిడుతూరు మండలంలో మిరప 750 ఎకరాలు, మొక్కజొన్న 450 ఎకరాలు, అరటి 50 ఎకరాలు, బొప్పాయి 20 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అంచనా. పంట చేతికొచ్చే దశలో నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పంట పొలాల పరిశీలన

వడగండ్ల వానతో జరిగిన పంట నష్టాన్ని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం ఉదయం నంద్యాల జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్, మండల ఏఓ పీరునాయక్, నందికొట్కూరు ఉద్యానశాఖ అధికారి తేజశ్విని తదితరులు మిడుతూరు మండలంలో పర్యటించారు. దేవనూరు, జలకనూరు, సుంకేసుల, తలముడిపి, రోళ్లపాడు, చింతలపల్లి, ఖాజీపేట, అలగనూరు తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. గ్రామాల వారీగా నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని వారు తెలిపారు.



బండిఆత్మకూరు.. రామాపురం సమీపంలో నేలవాలిన వరిపంట



పాములపాడు.. పెంచికల పల్లిలో నేలకొరిగిన మొక్కజొన్నపైరు



మిడుతూరు.. చింతలపల్లిలో నేలకొరిగిన కొర్ర పంట



మహానంది.. శ్రీనగరం సమీపంలో తడిసిన పసుపును ఆరబోసిన దృశ్యం



మిడుతూరు.. జలకనూరులో మిరపపైరును పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

నష్ట పరిహారాన్ని అంచనా వేయండి

నంద్యాల: అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, కోల్పోయిన పశు సంపదను అంచనా వేసి నష్టపరిహార ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి జయదేవ్ తదితర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కురిసిన



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

వడగండ్ల వర్షానికి జిల్లాలో 4,906 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 313 హెక్టార్లలో వాణిజ్య పంటలు 769 గొర్రెలు చనిపోయినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని, ఈ మేరకు బీమా ప్రీమియం వర్తింపు, నష్టపరిహార నిమిత్తం చర్యలు తీసుకోవాలని సూచించారు. అకాల వర్షాలు, వాతావరణ పరిస్థితులపై విపత్తు నిర్వహణ శాఖ నుంచి సమాచారం తీసుకొని ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే పంట, పశు నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద పెండింగ్‌లో ఉన్న 38,881 మంది రైతుల ఈ- కేవైసీని తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు పొలాల భూసార పరీక్షల గురించి రైతులకు వివరించాలని కోరారు. నిరుపయోగంగా ఉన్న సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డీఏఓ మోహన్‌రావుకు సూచించారు. ఉల్లి ధర మార్కెట్ ధర కంటే తక్కువగా ఉన్నందున ప్రొక్యూర్‌మెంట్‌కు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే 10 వేల మెట్రిక్ టన్నుల జొన్న, 24 వేల మెట్రిక్ టన్నుల శనగ పంట లక్ష్యాన్ని కూడా రీచ్ కావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మినీ గోకులం షెడ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీకి సూచించారు.

మారిన 'పది'పరీక్ష తీరు

- పేపర్-1, పేపర్-2 విధానం రద్దు
- 11 పేపర్ల నుంచి 6 పేపర్లకు కుదింపు
- ఇంటర్నల్, బిట్ పేపర్ పద్ధతికి స్వస్తి
- ఒక్కో సబ్జెక్ట్‌కు వంద మార్కులు
- గ్రేడ్ పాయింట్లు తొలగింపు, పాత విధానంలో మార్కుల కేటాయింపు



నంద్యాలలో పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

నంద్యాల(సిటీ): పది పరీక్షా విధానంలో సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నూతన విద్యా విధానానికి నాంది పలికింది. ఉమ్మడి (కర్నూలు, నంద్యాల) జిల్లాలో 1,016 పాఠశాలల్లో సుమారు 58,123 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. త్వరలో జరుగనున్న పరీక్షలను పాత పద్ధతిలో కాకుండా కొత్త విధానంలో నిర్వహించనున్నారు. ఇందులో నంద్యాల జిల్లాలోని 454 పాఠశాలల నుంచి 25,336 మంది విద్యార్థులు, కర్నూలు జిల్లా నుంచి 562 పాఠశాలల నుంచి 32,787 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 6,375 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వం చేపట్టిన నూతన పరీక్షా విధానంతో విద్యార్థులకు ఎంతో లబ్ధి చేకూరనుంది. ఇంటర్నల్, బిట్ పేపర్ విధానాలను తొలగించి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంది. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు, ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఒకే పేపర్ విధానం..

గతంలో పేపర్-1, పేపర్-2 పద్ధతిలో పరీక్షలు నిర్వహించే వారు. అయితే అందుకు భిన్నంగా ఒకే పేపర్ పరీక్షను వంద మార్కులకు నిర్వహించనున్నారు. అయితే ఈ పద్ధతిలో విద్యార్థులపై ఉన్న అధిక భారం తగ్గి పఠనాసక్తి పెరుగనుంది. రెండు సార్లు ఒకే సబ్జెక్టుకు సంబంధించి పరీక్ష రాయడానికి విద్యార్థులు పడుతున్న అవస్థలపై పాత పద్ధతైన ఒకే పేపర్‌తో ఒకే పరీక్షతో నిర్వహిస్తారు.

6 పేపర్లు..600 మార్కులు..

గతంలో ఆరు సబ్జెక్టులకు పదకొండు పేపర్లు పరీక్షలు రాయాల్సి వచ్చేంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే నేడు ప్రభుత్వం పేపర్లను కుదించి కేవలం 6 పేపర్లను 600 మార్కులకు పరీక్షలు నిర్వహించనుంది.

ఇంటర్నల్, బిట్ పేపర్ విధానానికి స్వస్తి..

గతంలో ఇంటర్నల్, బిట్ పేపర్ విధానాలతో అదనపు మార్కులను జోడించేవారు. ప్రస్తుతం ఇంటర్నల్ మార్కులను పూర్తిగా తొలగించారు. అలాగే ప్రత్యేకంగా 30 మార్కులకు ఉన్న బిట్ పేపర్‌ను రద్దు చేసింది.

గ్రేడ్ పాయింట్లు తొలగింపు...

గ్రేడ్ పాయింట్ల విధానంతో జరుగుతున్న అనర్థాలకు ప్రభుత్వం ముగింపు పలికింది. గ్రేడ్ పాయింట్ల వల్ల విద్యార్థులకు, ఉన్నత చదువుల్లో తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయన్న విమర్శలు సైతం ఉన్నాయి. ఇటీవల ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో చేరడానికి గ్రేడ్ల ఆధారంగా సీట్లు కేటాయింపులో అధికారులు అవస్థలు పడ్డారు.

పరీక్షా సమయం పెంపు..

గతంలో ఉన్న పరీక్షా సమయాన్ని ప్రభుత్వం మార్పు చేసింది. ఈ సమయం గతంలో 3 గంటలు ఉండేది, అయితే అదనంగా 15 నిమిషాల వ్యవధిని పెంపొందించారు. ఈ 15 నిమిషాల నిడివిలో ప్రశ్న పత్రాన్ని చదవడానికి, రాసిన సమాధానాలను సరి చూసుకోవడానికి కేటాయిస్తే పరీక్ష మరింత సమయంతో సమాధానాలు రాసే అవకాశం ఉంటుంది.

ప్రశ్న పత్రాలు ఇలా ఉండనున్నాయి..

- తెలుగులో పద్యభాగంలో ప్రతి పదార్థాలు, కంఠస్థ పద్యాలు, చిన్న ప్రశ్నలు, వ్యాస రూప ప్రశ్నలు, ఉంటాయి.
- హిందీలో 1మార్కు పేరాగ్రాఫ్ ద్వారానే ప్రశ్నలు, గ్రామర్, లేఖ, వ్యాస రూప ప్రశ్నలు ఉంటాయి.
- ఇంగ్లిష్‌లో పేరాగ్రాఫ్ ప్రశ్నలు, గ్రామర్, క్రియేటివిటీ రైటింగ్స్ ఉంటాయి.
- సామాన్య శాస్త్రం మినహా అన్ని సబ్జెక్టులకు ఒక్కటే ప్రశ్న పత్రం ఉంటుంది
- సామాన్య శాస్త్రంలో భౌతిక, రసాయన శాస్త్రాలు ఒక విభాగం, జీవశాస్త్రం పేపర్లను పార్ట్-ఏ, పార్ట్- బీలుగా చేసి ఒక్కో పార్ట్‌కు 50 మార్కులతో ప్రశ్న పత్రాలు ఇవ్వనున్నారు.
- గణిత శాస్త్రంలో గ్రాఫ్‌లు, సైన్సులో బొమ్మలు గీయడం, సోషల్‌లో 2 మ్యాప్‌లు (ఇండియా, వరల్డ్) ఉండనున్నాయి.

మొత్తంగా నాలుగు సెక్షన్లగా 33 ప్రశ్నలకు 100 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది.

- సెక్షన్- ఏలో ఒక్క మార్కు సూక్ష్మ లఘు ప్రశ్నలకు 12 మార్కులు కేటాయిస్తారు.
- సెక్షన్- బీ లో రెండు మార్కుల తేలికైన ప్రశ్నలు-8 ఉంటాయి.
- సెక్షన్- సీ లో నాలుగు మార్కుల లఘు ప్రశ్నలు-8 ఉంటాయి.
- సెక్షన్-డీ లో ఎనిమిది మార్కుల వ్యాసరూప ప్రశ్నలు-5 ఉంటాయి.

పరీక్షల విధానం మారింది..



బోధన ఆధారంగా పరీక్షల్లో ప్రభుత్వం మార్పులు చేపట్టింది. ఈ మార్పులతో విద్యార్థుల అభ్యసనా పద్ధతిలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. అంతే కాకుండా బిట్ పేపర్‌ను రద్దు చేసి విద్యార్థులకు అదనపు సమయాన్ని ఇవ్వడం హర్షనీయం. గ్రేడ్ పాయింట్ల పద్ధతిని రద్దు చేసి మార్కులు కేటాయించడం వల్ల ర్యాంకులు తెలుసుకోవచ్చు. ఇంటర్నల్ మార్కుల రద్దుతో విద్యార్థులలో పఠనాసక్తిని పెంచవచ్చు.

– అనురాధ, డీఈఓ, నంద్యాల

ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలి

పాములపాడు: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఎస్ఐ అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద పాదయాత్రీకులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి దైవ భక్తితో కాలినడకన శ్రీశైలానికి వెళ్తున్న వారికి మజ్జిగ పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో మజ్జిన పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి, సామన్న, నాయకులు పాల్గొన్నారు.

బీఎస్ఆర్ ఆధ్వర్యంలో..

నందికొట్కూరు నియోజకవర్గ బీఎస్ఆర్ యువ సేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మజ్జిగ, చల్లని నీరు పంపిణీ చేయడం జరిగింది. యువ సేన నాయకులు రమేష్‌నాయుడు, రంగ, నాగరాజు, జగదీష్‌గౌడు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఐ

ఆత్మకూరు: కాలినడకన శ్రీశైలం వెళ్తున్న భక్తులకు వైఎస్ఆర్‌సీపీ బీసీ సంఘం నాయకులు శుక్రవారం పట్టణంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీసీసంఘం అధ్యక్షుడు డబ్బి వెంకటస్వామి గౌడు, వీరన్న, లక్ష్మణ్ సింగ్, రమణ, తదితరులు పాల్గొన్నారు

భయాందోళనలకు దూరంగా ఉండాలి

మహానంది: అటవీశాఖ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో కొద్దిపాటి చిన్న రుగ్మతలకు గురైనప్పుడు భయాందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని ఏపీ రెడ్ క్రాస్ ట్రైనర్, స్విమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మహానందిలోని పర్యావరణ కేంద్రంలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమచికిత్సపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రథమచికిత్స అనేది రోగికి ఎక్కడా అవసరమైతే అక్కడ వెంటనే చేయాల్సి ఉంటుందన్నారు. కార్డియాక్ అరెస్ట్, సీపీఆర్‌ల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు పర్ల దస్తగిరి, డీఎఫ్ఓ వినీత్‌కుమార్, ఎఫ్ఆర్‌ఓలు శివన్న, ఈశ్వరయ్య, శ్రీపతినాయుడు, త్రినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

సంక్షిప్త సమాచారం

క్యాలెండర్ విడుదల

నందికొట్కూరు: ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత శకం తెలుగు ఉగాది కాలమాని సూచిక క్యాలెండర్‌ను టౌన్ సీఐ విజయభాస్కర్ శుక్రవారం విడుదల చేశారు. పట్టనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అందరికీ అర్థమయ్యే విధంగా క్యాలెండర్ రూపొందించడం విశేషమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు రామచంద్రుడు, సభ్యులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

నందికొట్కూరు: బకాయి ఉన్న ఆస్తి పన్నును ఈనెలాఖరులోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నుదారులు ప్రభుత్వం కల్పించిన వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులను ఆదుకోవాలి

మిడుతూరు: వడగండ్ల వానకు నష్టపోయిన మిరప, మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం జలక నూరు, తలముడిపి గ్రామాల్లో దెబ్బతిన్న మిరపపండు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు.

ఈ క్రాప్ తప్పనిసరి

ఆత్మకూరు: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను రైతులు ఆర్బీకేల్లో నమోదు చేయించుకోవాలి మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ జాబితాను అన్ని ఆర్బీకేల్లో ఏర్పాటు చేశామన్నారు. వాటిని రైతులు చెక్ చేసుకుని అభ్యంతరాలుంటే ఆర్బీకేల్లో గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని ఆయన సూచించారు.

దాడులను ఖండించాలి

ఆత్మకూరు: త్రిపుర రాష్ట్రంలో ప్రతి పక్ష పార్టీల కార్యాలయాలపై పై బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం అన్నారు. బీజేపీ తీరుకు నిరసనగా శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు రాంనాయక్, రణధీర్, మల్లయ్య, శివకుమార్, గణపతి, నూర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గేట్ ఫలితాల్లో ప్రతిభ



గరుడాద్రి వశిష్ట

ఆత్మకూరు: పట్టణానికి చెందిన న్యాయవాది సుదర్శన్, చంద్రికల కుమారుడు గరుడాద్రి వశిష్ట ఇటీవల విడుదలైన గేట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో 163వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి ప్రైమరీ విద్యాభ్యాసం స్థానిక సత్యవాణి విద్యామందిరం, 8నుంచి 10 వరకు డీపాల్ హైస్కూలు, ఇంటర్మీడియట్ నారాయణకాలేజీలో చదివాడు. ఇంజినీరింగ్ తిరుపతి ఎస్వీ యూనిర్సిటీలో పూర్తి చేశాడు. తాజాగా గేట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించడంతో విద్యార్థి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా రోఖియాబీ ఉరుసు

వెలుగోడు: పట్టణంలోని రోఖియాబీ దర్గా ఉరుసు శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రజలు కులమతాలకు అతీతంగా దర్గాకు చేరుకుని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. వైఎస్ఆర్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి దర్గాను దర్శించుకున్నారు. దర్గా కమిటీ సభ్యులు ఆయనకు పూలమాలలు, శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దర్గా వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భువనేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, నాయకులు దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, రామ్మోహన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అమీర్ అలీఖాన్, ఖాదర్‌వలి, ఎంపీటీసీ చాంద్‌బాషా, తెలుగు రమణ, షంషీర్ అలీ, సూర్య నారాయణ, అచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఫాతెహాలు చదివిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

శ్రీశైలం.. భక్తజన సంద్రం

- ఉగాది ఉత్సవాలకు తరలివస్తున్న కన్నడిగులు
- కిటకిటలాడుతున్న క్యూలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని స్వామి దర్శనానికి కన్నడ భక్తులు భారీగా తరలిస్తున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దీంతో కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన వేలాది మంది కాలినడకన శ్రీశైలం చేరుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పూజావేళల్లో అధికారులు మార్పులు చేశారు. వేకువజాము నుంచే భక్తులను స్వామి అమ్మవార్ల దర్శనానికి అనుమతిస్తున్నారు. శుక్రవారం ఆలయ ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు పూర్తిగా నిండిపోయాయి. కన్నడ భక్తులకు నాలుగు విడతలుగా మల్లన్న స్పర్శ దర్శనాన్ని కల్పించారు. తరలివస్తున్న భక్తులతో ఆలయ పురవీధులన్నీ కిటకిటలాడుతున్నాయి.



నల్లమలలో పాదయాత్రగా వెళ్తున్న కన్నడిగులు

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

ఏప్రిల్ 11న జరిగే కుంభోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి సాత్వికబలిగా కొబ్బరికాయలు సమర్పిస్తారు. అలాగే కుంభోత్సవం రోజు స్త్రీ వేషధారణలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కార్యక్రమంలో భాగంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం, శుక్రవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీభ్రమరాంబాదేవికి కొబ్బరికాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి, పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ హరిదాసు, పర్యవేక్షకులు స్వాములు, ఆలయ ఉద్యోగి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీశైల పురవీధులు